శ్రీ యస్.కె.నరసింహారావు, ఐ.ఎ.ఎస్.
రాష్ట్ర ప్రాజెక్టు డైరెక్టర్
జిల్లా ప్రాథమిక విద్యా పథకం

## ఓ మాట...

నేర్చుకోవడం జీవితం నుంచి వేర్పడిన నాటి నుంచి 'చదువు' మొదలయ్యింది. ఈ చదువు ఉన్న వారికీ, లేనివారికీ మధ్య వివక్షత చూపుతూ ఉన్న వారిని అందలం ఎక్కిస్తూనే, ఇంకోవైపు చింతిస్తున్నాం. బట్టీ పట్టడం, మూసపోత మూక ఆలోచన విధానాన్ని ప్రోత్సహిస్తూ వస్తోంది. చదువును ఆసక్తికరంగా, సృజనాత్మకంగా, ఆనంద దాయకంగా, జీవితంతో సంబంధం గలదిగా మలచటానికి సమాంతరంగా అనేక ప్రయత్నాలు కొనసాగుతున్నాయి. ఈ విషయంలో మన దేశంలో ఠాగూర్, గాంధీ, గిజుభాయి ఆలోచనలు ఎందరికో ప్రేరణగా నిలిచాయి. ఇటువంటి తత్వవేత్తలు, విద్యావేత్తల గురించి, చదువులలో ప్రయోగాలు గురించి ఆరు పుస్తకాలను కూర్చి 'చదువులు - కొత్తదారులు' పేరుతో జనవిజ్ఞాన వేదిక, మంచి పుస్తకం కలిసి ప్రచురించటం సంతోషం. అన్ని వేళలా, అన్ని సందర్భాలలో పిల్లల పక్షాన ఉండటమే తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు చేయవలసిన పని అని ఈ పుస్తకాలు చెబుతాయి. ఇంతింతలో విద్యావేత్తలూ, వారి ప్రయోగాలూ ఇందులో చోటు చేసుకోలేకపోయినప్పటికీ ఈ ప్రయత్నం చదువుతో ముడిపడిన వారందరికీ - విద్యార్థులు, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, పిల్లల బాగుకోరే వారందరికీ ఉపయోగకరంగా ఉంటుందనీ, ఆలోచనలకు ఊతమవుతుందనీ ఆశిస్తూ...

హైదరాబాదు
సెప్టెంబరు, 2002

(యస్.కె.నరసింహారావు)



# అపురూపమైన బడి

డా॥ అభయ్‌బంగ్
అనువాదం: కె.మాధవి, యం.శ్రీనివాస్

జన విజ్ఞాన వేదిక
మంచి పుస్తకం



చదువులు - కొత్తదారులు-1
అపురూపమైన బడి: డా॥ అభయ్‌బంగ్
హిందీ మూలం: మేరా జాదూయి స్కూల్ హిందీలోకి అనుసృజన అరవింద గుప్తా)
అనువాదం: కె.మాధవి, యం.శ్రీనివాస్
బొమ్మలు: అవినాష్ దేశ్‌పాండే
హిందీలో ఈ పుస్తకమాల సంపాదకులు: అరవింద గుప్తా
తెలుగులో ఈ పుస్తకమాల సంపాదకులు: కె.సురేష్
© భారత జ్ఞాన విజ్ఞాన సమితి

కంపోజింగ్: ఆర్.జె. గ్రాఫిక్స్
చిక్కడపల్లి, హైదరాబాద్-500 020.
ఫోన్: 661 0373

ముద్రణ: చరిత గ్రాఫిక్స్
చిక్కడపల్లి, హైదరాబాద్-20.
ఫోన్: 760 7361

వెల: రూ. 4.00
ప్రచురణ కాలం: సెప్టెంబరు, 2002

ప్రచురణ, ప్రతులకు:
జన విజ్ఞాన వేదిక
జి.మల్యాద్రి, కన్వీనర్ ప్రచురణల విభాగం
162, విజయలక్ష్మినగర్
కొత్తూరు పోస్ట్, నెల్లూరు - 524 004.
ఫోన్: 0861-305303

మంచి పుస్తకం
'వాసన్', 12-13-452, వీధి నెం.1
తార్నాక, సికింద్రాబాద్ - 500 017.

జాతీయ సాక్షరతా మిషన్ సహాయంతో భారత జ్ఞానవిజ్ఞాన సమితి, న్యూఢిల్లీ ప్రజల చదువుల ఉద్యమం (జనవాచన్ ఆందోళన్) పేరుతో బాలల పుస్తకమాలగా దాదాపు 60 పుస్తకాలు ప్రచురించింది. గ్రామీణ ప్రజలు, పిల్లల్లో చదవటంపట్ల ఆసక్తి కలిగించటం ఈ పుస్తకాల ఉద్దేశం. వాటిల్లోనుంచి చదువులు, విద్యావేత్తలు, కొన్ని ప్రయోగాత్మక బడుల గురించిన ఆరు పుస్తకాలను ఎంపికచేసి 'చదువులు - కొత్తదారులు' పేరుతో ప్రచురిస్తున్నాం. ఈ ఆరు పుస్తకాలు ప్రత్యేకించి 'చదువు'కి సంబంధించి ఆసక్తి ఉన్న ఉపాధ్యాయులు, విద్యావేత్తలు, తత్వవేత్తలు, కార్యకర్తలు, తల్లిదండ్రులను ఉద్దేశించి ప్రచురిస్తున్నాం.

# అపురూపమైన బడి



డా॥ అభయ్ బంగ్

# అపురూపమైన బడి

నేను చదువుకున్న బడి ఎంతో అద్భుతమైనది. అటువంటి చదువు ఈరోజు నా కొడుకు ఆనంద్‌కి నేను అందించలేకపోతున్నాను. "మా రోజులే వేరు. అప్పటిమాట ఇప్పుడెక్కడ?" అని అంటూ ఉంటారు. అయినా నాకు చాలా బాధగా ఉంది. అసలు మా బడిలో విశేషం ఏముందో? చెబుతాను.

తొమ్మిదవ తరగతి వరకు నా చదువు గాంధీజీ 'నయీ తాలీమ్' (నూతన విద్యా విధానం) అనుసరించి జరిగింది. అందులో నాలుగు సంవత్సరాలు నేను సేవాగ్రాం ఆశ్రమంలోని బడిలో గడిపాను. విద్య అంటే పరిసరాలని మర్చిపోయి తరగతి గోడల మధ్య బందీయై పాఠాలని వల్లె వేయడం మాత్రమే కాదు. దీనికి విరుద్ధంగా గాంధీజీ "ప్రకృతి, ప్రపంచానికి దగ్గరగా ఉంటూ, సమాజానికి ఉపయోగపడే పనులద్వారానే పిల్లల బుద్ధి వికసిస్తుంది. ఈవిధంగా పిల్లలు ఎన్నో పనులలో నైపుణ్యం పొందుతారు" అని నమ్మేవారు. ఈ విద్యావిధానాన్ని వికసింపచేయడానికి, గాంధీ కోరిక మేరకు రవీంద్రనాథ్ టాగోర్ శాంతి నికేతన్ నుండి ఆర్యనాయగమ్, ఆశాదేవీలను సేవాగ్రాం పంపించారు. ఆర్య నాయగం శ్రీలంకకు చెందిన వారు కాగా శ్రీమతి ఆశాదేవి బెంగాలీ మహిళ. వీరి రాకతో గాంధీ నమ్మిన సిద్ధాంతానికి టాగోర్ ప్రకృతి, కళాప్రేమ తోడయ్యాయి.

మొదటినుంచి కూడా మా తల్లిదండ్రులు ఈ సిద్ధాంతాన్ని నమ్మి సహక రించారు. ఈ బడిలోని పద్ధతులు చాలా భిన్నంగా ఉండేవి. ఇందులో కొన్నిటి గురించి ఇక్కడ చెబుతున్నాను.

## జంతువులతో పరిచయం



"జంతువులు – వాటి సంరక్షణ" గురించి ఈ రోజుల్లో చాలా చర్చ జరుగుతోంది. కానీ ఇరవై ఏడు సంవత్సరాల ముందు ఈ విషయానికి అంత ప్రాముఖ్యత ఉండేది కాదు. మరాఠీ చెప్పే పాటిల్ మాష్టారు ఒక పనస చెట్టుకొమ్మమీద కూర్చుని మాకు పాఠాలు చెప్పేవారు. ఆయన మాకు అడవి గురించి బోలెడు కథలు, ఆయన వేటాడినప్పటి సంగతులు వర్ణించ చెప్పేవారు.

ఒకరోజు వేటాడుతూ ఆయన ఒక జింకని తుపాకీతో కాల్చారు. గర్భంతో ఉన్న అమాయక జీవి దైన్యాన్ని చూసి ఆయన తల్లడిల్లి పోయారు. ఈ సంఘటన ఆయనను ఎంతగానో బాధించింది. ఫలితంగా ఆయన తుపాకీని వదిలేసి కెమేరా పట్టుకున్నారు. అప్పటినుండి రకరకాల జంతువులని తన కెమేరాలో బంధించసాగారు. చెట్టుమీద మంచెపైన ఎన్నో రాత్రులు ఉండి మంచి ఫొటోలను తీశారు. గగుర్పొడిచే ఆయన అనుభవాలు వింటే

జంతువుల పట్ల ఆయనకున్న అపారమైన ప్రేమ తెలుస్తుంది. ఆయన ఎంతో మాటకారి. ఆయన చెప్పే కథలు వింటే మేమే అడవిలో తిరిగి వచ్చామన్నంత గొప్ప అనుభూతి కలిగేది. అడవి గురించి చాలా విషయాలు తెలియడమే కాకుండా దానిమీద ఎంతో ప్రేమ కలిగింది.

ఇప్పటి పుస్తకాలు జంతువుల గురించి చెప్పాలంటే "ప్రాణులంటే పశువులు" లాంటి వాక్యాలతో మొదలు పెడతారు. ఇలాంటి నీరసమైన, అర్థంలేని మాటలతో పిల్లలని ఎలాగ ఉత్తేజపరచడం? మహారాష్ట్రలోని గఢ్‌చిరోలి జిల్లాలో ఇప్పటికీ బ్రహ్మాండమైన అడవి ఉంది. కానీ అక్కడ కూడా పిల్లలకు ప్రకృతితో ఎటువంటి సంబంధం లేకుండా ఇటువంటి పాఠాలే చెబుతున్నారు. ✪

## సాధువుల మేళా

భక్తతుకారాం కవితలు కూడా చేదుమందులా మింగాల్సిన అవసరం మాకు కలగలేదు. ప్రతి ఆషాఢమాసం ఏకాదశి రోజున మా బడిలో సాధువుల మేళా జరిగేది. ఈ మేళాలో సాధువులందరి జీవితాలలోకి తొంగి చూడగలిగే వాళ్ళం. వారి గురించి నాటకాలు వేసేవారు. చిత్రాలు గీసేవారు. వ్యాసాలు కూడా రాసేవారు. బడిపిల్లలందరు కలిపి ఈ పనులన్నీ చేసేవారు. దాదాపు పదిహేను రోజులపాటు బడి ఒక జాతరలాగా ఉండేది. భక్త తుకారాం రాసిన ఒక కవితని మూడు విధాలుగా పాడటం నేను అక్కడే నేర్చుకున్నాను. అక్కడి గానసభలో నేను మొదటిసారిగా 'రాగభైరవి' పాడాను. సాధువుల ఉపదేశాలు, వారి జీవిత చరిత్ర మొదలైనవి మేం ఆడుతూ, పాడుతూ నేర్చుకున్నాం. అయితే అక్కడ భాష, చరిత్ర, సంగీతం అని వేరు వేరు పేర్లు ఉండేవి కావు.





చాలా సంవత్సరాల తరువాత నేను ఒక ప్రభుత్వ పాఠశాలలో "కావ్య కుసుమాంజలి" అనే ఒక పెద్ద పుస్తకంలో భక్తతుకారాం కవితని చూశాను. దాన్ని చూస్తే బహుశా భక్త తుకారాం కూడా ఎంతో బాధపడేవాడు. ✪

## వృక్షశాస్త్రం

పుస్తకాలలోని బొమ్మలని చూపించి, చెట్ల గురించి ఈ రోజుల్లో చాలా బడులలో నేర్పుతారు. మొక్కలలోని రకరకాల జాతుల శాస్త్రీయ నామాలని పిల్లలు కష్టపడి బట్టీపడతారు. పరీక్షలవ్వగానే మరిచిపోతారు. కానీ మా బడిలో వేరుగా ఉండేది. మా బడి చుట్టూ ఎన్నో తోటలు, పొలాలు ఉండేవి. మా మాష్టారు పిల్లలందరిని ఆ తోటల్లో, పొలాల్లో తిప్పేవారు. అక్కడ



మొక్కల పరిశీలన జరిగేది. కనిపించిన ప్రతి మొక్క పేరుతో మొదలుపెట్టి దాని ఆకులు, పూలు, పండ్ల గురించి వివరంగా తెలుసుకునే వాళ్ళం. అలా వెళ్ళినప్పుడు రేగుపండ్లు, ఉసిరికాయలు వగైరా కోసుకొని తినేవాళ్ళం (ఇలా బడిలోతింటూ పాఠాలు నేర్చుకోవడం నేను మళ్ళీ అమెరికాలోనే చూశాను. కాని అక్కడి తరగతులలో చాక్లెట్లు తింటారు. కోకోకోలాలు తాగుతారు). ఇలా తింటూ రేగిపండ్లు, మామిడికాయల మధ్య పోలికలు, తేడాలు చర్చించుకునే వాళ్ళం. అలాగే ఇంకా కొన్ని పండ్లని చూసి వాటి గురించిన విషయాలు రాసుకునేవాళ్ళం. తోటలు, పొలాల వెంబడి తిరుగుతూ ప్రకృతిని చాలా దగ్గరనుంచి చూడగలిగాం. ఈవిధంగా మేం వృక్షశాస్త్రాన్ని క్షుణ్ణంగా నేర్చుకున్నాం. 'బాటనీ' పుస్తకాలలో ఉండే సిద్ధాంతాలు మా పరిసరాల నిండా కనిపించేవి. వాటిని పరిశీలించి నేర్చుకోవాలన్న ఆసక్తి మా టీచరు మాలో కలిగించారు. 'పామేట్, డైవర్జెట్, రెటిక్యులేట్' లాంటి తలా తోకాలేని పదాలు మాకు వంటబట్టేవి కాదు. ఎందుకంటే ఆ బొప్పాయి చెట్టు మా కళ్ళ ముందర ఠీవిగా నిలబడి ఉండేది.

ఏడవ తరగతి పరీక్ష కూడా మాకిలాగే జరిగింది. మా టీచర్ ఏడవ తరగతి పరీక్ష కని మమ్మల్ని రకరకాల ఆకులని, పూలని జమచేయ మన్నారు. వీటికోసమని మేం మా చుట్టుపక్కల వీధులన్నీ గాలించాం. ఎన్నోరకాల ఆకులని, పువ్వులని సేకరించాం. వాటన్నిటిని కూర్చి ఒక ఆల్బం కూడా తయారుచేశాం. అందుకే ఇరవై ఐదు సంవత్సరాల తరువాత కూడా నాకు సేవాగ్రామ్ పరిసరాలలో ఎక్కడ ఏ చెట్టుందో బాగా గుర్తుంది. ఆ మొక్కలు ఇప్పటికీ నా కళ్ళముందు కనిపిస్తాయి. బడిలో ఇలా నేర్చుకోవడం వల్ల నేను కాలేజీలో వృక్షశాస్త్రం ఎంతో సులువుగా నేర్చుకోగలిగాను. ఈ శాస్త్రంలో నాకు కాలేజీలో అందరికంటే ఎక్కువ మార్కులు వచ్చాయి. ఈ విషయమై నన్ను మా ప్రొఫెసరు పొగిడినప్పుడు నేను నా మనస్సులోనే అనుకున్నాను: "సర్, నేను ఈ విషయాలన్నీ మా సేవాగ్రామ్ బడిలోనే నేర్చుకున్నాను. ఈ కాలేజీలో కాదు." ✪

## నిత్యజీవితంలో గణితం-అంటే లెక్కలు

"ఒక నీళ్ళ తొట్టిలో రెండు పైపులు అమర్చి ఉన్నాయి. ఒకపైపు నుండి ఆ తొట్టిలో నీళ్ళు పడుతున్నాయి, మరొక పైపు ఆ నీళ్ళని బయటికి



వదులుతోంది. ఆ తొట్టి ఎంత సేపట్లో నిండుతుంది?" ఇలాంటి అర్థం పర్థం లేని లెక్కలు మనకు బడి పుస్తకాలలో కనిపిస్తాయి. ఇటువంటి ప్రశ్నలను చూస్తే అసలు ఈ లెక్కలకు, మన జీవితానికి ఏమైనా సంబంధం ఉందా? అన్న అనుమానం కలుగుతుంది.

ఏ మాత్రం తెలివి ఉన్నవాడైనా ఈ ప్రశ్నకు సమాధానం చెప్పే బదులు ఆ కింద ఉన్న పైపుని మూసి ఈ గొడవ వదిలించుకుంటాడు.

కొలతలు, మిగిలిన లెక్కలు నేను సేవాగ్రామ్‌లో ఎలా నేర్చుకున్నానో ఇక్కడ చెబుతాను. ప్రతిరోజు దాదాపు మూడుగంటలపాటు మేం తప్ప కుండా ఏదైనా ఉపయోగకరమైన పనిచేయాల్సి ఉండేది. అక్కడి విద్యా విధానంలో అది ఒక భాగం. దీనికి కారణాలు 1) గాంధీ సూచించిన "బ్రెడ్ లేబర్" అంటే సొంత శ్రమ తోటి తిండి సమకూర్చుకోవడం అనే సిద్ధాంతం. 2) సమాజానికి ఉపయోగపడే కార్యక్రమాల ద్వారా బుద్ధి కుశలత పెంచుకో వచ్చునన్న వినోబా భావే ఆలోచన. దీని ప్రకారం నేను కొన్నిరోజులు సేవాగ్రామ్‌లోని గొడ్ల చావిడిలో పనిచేశాను. అప్పుడే కొత్త చావిడి కట్టే పని మొదలయ్యింది. అందులో భాగంగా మా మాష్టారు నాకు ఒక పని చెప్పారు: "రోజుకి ఒక ఆవు ఎన్ని నీళ్ళు తాగుతుందో గమనించు. ఆ తరువాత మన చావిడిలో ఉన్న గొడ్లన్నిటికీ కలిపి రోజుకి ఎన్ని నీళ్ళు కావాలో లెక్కకట్టు. అన్ని నీళ్ళకి సరిపడే తొట్టి మనం నిర్మించాలి. ఆ తొట్టి కట్టడానికి ఎన్ని ఇటుకలు కావాలో లెక్కకట్టి అవి కొనుక్కొని రా." తొట్టి వైశాల్యం ఎలా కనుక్కోవడం? వాటి చుట్టుకొలత ఎలా తెలుసుకోవడం? ఈ ప్రశ్నలన్నిటికి సమాధానాలు తెలుసుకోవడానికి నేను వారంరోజులపాటు ఎంతో కష్టపడ్డాను. నీళ్ళ తొట్టి కట్టడం కోసం నేను ఈ లెక్కలన్నీ నేర్చుకున్నాను.

✪

# వంట - శిక్షణ

మా బడిలో రోజూ దాదాపు వందమంది అన్నం తినేవారు. ఇంత మందికి వంట చేసే బాధ్యత వంతులవారీగా పిల్లలకి ఇచ్చేవారు. ఎనిమిది మంది ఒక జట్టుగా కూడి ఈ పని చేసేవాళ్ళు. ఒక నెలలో వంటకి ఎంత



ఖర్చు చేయవచ్చో ముందే నిర్ణయించి చెప్పేవారు. పరిమితమైన ఖర్చుతో రుచిగా ఉండి, పోషక విలువలు కలిగిన ఆహారం అందించటం మాకు శక్తికి మించిన పనిగా ఉండేది. ఆలుగడ్డలు ధర తక్కువగా ఉండేవి. కానీ పోషకవిలువల దృష్ట్యా ఎక్కువగా పిండి పదార్థాలే ఉండటం వల్ల వాటిని వదిలేయవలసి వచ్చింది. ఐ.సి.ఎమ్.ఆర్ (భారతీయ వైద్య పరిశోధనా మండలి) వాళ్ళు చెప్పిన కనీస మోతాదు నూనె వాడితే నెలకి కేటాయించిన డబ్బు అంతా నూనెకే సరిపోయేది. తెలివైన గృహిణికున్న నేర్పు కూడా మాకు లేదు. ఈ అర్థశాస్త్రం, ఆహార శాస్త్రాలతో కుస్తీపడుతూ ఏదోవిధంగా



పని జరిపించటానికి ప్రయత్నించే వాళ్ళం. చాలాసార్లు మేం అనుకున్నవి కాగితాల మీదనే సాధ్యపడేవి. నిజంగా అలా చేయలేక పోయేవాళ్ళం. పప్పు ఉడకటానికి ఎంతసేపు పడుతుందో కూడా చాలాసార్లు మాకు తెలిసేది కాదు. చివరికి రాత్రికి మేం గిన్నెలని తోముతూ, కడుగుతూ ఉంటే యుద్ధం లో గాయపడిన సైనికుల మాదిరి అనిపించేది. అప్పుడు కూడా మరుసటి రోజు చేయవలసిన వంట పనులు మా కళ్ళ ముందర మెదులుతూనే ఉండేవి.

కానీ ఈ మొత్తం పనిలో మేం మూడు విషయాలు బాగా నేర్చుకున్నాం. అవి పోషక విలువల గురించి తెలిపే ఆహారశాస్త్రం, ఇంటికి సంబంధించిన ఆర్థికశాస్త్రం, ఇంకా పాక శాస్త్రం. కొత్తిమీరలో 10,600 యూనిట్ల 'ఎ' విటమిన్ ఉంటుందనే విషయం నాకు ఇప్పటికీ గుర్తుంది. నేను వంటింట్లో పనిచేస్తూ కొద్ది రోజుల్లో నేర్చుకున్న విషయాలు మెడికల్ కాలేజీలో పది సంవత్సరాలలో కూడా నేర్చుకోలేదు.

# పొలం పనులలో ప్రయోగాలు

సేవాగ్రామ్‌లోని పిల్లలందరూ తప్పనిసరిగా వ్యవసాయం చేసేవారు. పిల్లలందరికీ తలా కొంత భూమిని కేటాయించేవాళ్ళు. ఆ భూమిని దున్నడం, విత్తనాలు చల్లడం, నీళ్ళు పెట్టడం, ఎరువు వేయడం వంటి పనులన్నీ పిల్లలే చేసేవారు. పొలాలకి బావినుండి నీళ్ళు తోడడానికి పిల్లలందరికీ ఎంతో సమయం పట్టేది. అప్పుడప్పుడు తోడుకునే అవకాశం అర్థరాత్రి మాత్రమే దొరికేది. ఆ సమయంలో నక్కల ఊళలతో ఎంతో భయమేసేది. కానీ ధైర్యం చేసి పొలాలకి నీళ్ళు పెట్టేవాళ్ళం. ఈ పనులు చేస్తూ, మేం పండ్ల చెట్ల గురించి, పంటల సేద్యం గురించి నేర్చుకున్నాం. ఎరువు వేసే ముందు వాటి రసాయనిక గుణాలని అర్థం చేసుకొనే వాళ్ళం. ఇందుకోసం మేం అనుభవం కలిగిన రైతులతో తరచూ మాట్లాడేవాళ్ళం. జపాన్‌లో వ్యవసాయం చేసివచ్చిన ముక్తేశ్వర్ భాయి, ద్రాక్ష తోటల్లో మొట్ట మొదట ప్రయోగాలు చేసిన ప్రేమ్ భాయి వారిలో ఉన్నారు. ఇజ్రాయిల్‌లో చాలా సంవత్సరాలు వ్యవసాయం చేసిన హవేలీగారి పొలం మాకు చాలా దగ్గరగా ఉండేది. ఆయన ఎద్దులకు బదులు గుర్రాలతో పొలం దున్నించే వారు. అప్పుడప్పుడు మాకు అన్నా సాహెబ్ సహస్రబుద్ధి వ్యవసాయ, అర్థశాస్త్రాన్ని బోధించేవారు. ఇలాంటి వాతావరణంలో వ్యవసాయం చేస్తూ మేం ఎంతో నేర్చుకున్నాం. ఎవరి పొలంలో ఎక్కువ దిగుబడి వస్తుంది అనే విషయంలో పిల్లలు పోటీపడేవారు. దిగుబడిని పెంచడానికి తట్టలకొద్దీ ఆవుపేడ తెచ్చి వేసే వాళ్ళం. ఇలా ఎరువు ఎంతోవేసి నేను రెండు కిలోల వంకాయని పండించాను. దాన్ని అమ్మడానికి వార్ధా తీసుకొని వెళ్ళినప్పుడు అది మంచిది కాదేమో అని ఎవ్వరూ కొనలేదు.

# సజీవ విద్య

"నయీతాలీమ్" విద్యావిధానం పైన తరచు ఒక ఆరోపణ వినబడుతుంది. "ఈ విద్యావిధానంలో పిల్లలు శారీరక శ్రమ ఎక్కువగా చేస్తారు. విజ్ఞానం సంపాదించుకోవటానికి ఇది ఒక అడ్డంకి" అన్నదే ఆ ఆరోపణ. మద్రాసు ప్రాంతంలో ఈ విద్యా విధానాన్ని ప్రవేశ పెట్టినప్పుడు ఇందులోని శారీరక శ్రమవల్ల వారి పిల్లల చదువు వెనకబడుతుందని అక్కడివారు నిరసన తెలిపారు. దీని కారణంగా అప్పటి ముఖ్యమంత్రి రాజాజీ రాజీనామా చేయాల్సి వచ్చింది. పిల్లలు తమ మెదడులో ఎన్నోరకాల విషయాలను నింపుకొని, పరీక్షల్లో అంతా బయటికి కక్కేయడమే చదువు అనుకునేవారికి ఈ ఆరోపణ నిజమే అనిపిస్తుంది. గంధకామ్లాన్ని తయారుచేసే నాలుగు పద్ధతులు తెలియకపోతే ఆ చదువు పనికిరానిదని ఇలాంటివారు నమ్ముతారు. తొమ్మిదవ తరగతి పిల్లలకి ఈ విషయాలు ఎలా ఉపయోగపడతాయనేది వీరికి అనవసరం.

దీనికి విరుద్ధంగా "నయీతాలీమ్" లోని పిల్లలు జీవితానికి సంబంధించిన చాలా విషయాలని ఎంతో బాగా నేర్చుకున్నారు. అయితే చరిత్ర, భూగోళం, రాజనీతి శాస్త్రం వంటి విషయాలలో వీరి స్థితి ఏంటో చూద్దాం. భూగోళ శాస్త్రాన్ని నేనెప్పుడు పాఠాలలాగా చదవలేదు. సేవాగ్రామ్‌కి దేశ విదేశాల నుండి చాలామంది వచ్చేవారు. వీరందరు చెప్పిన రకరకాల విషయాల నుంచి మేం ఎంతో నేర్చుకున్నాం. నాకు వేరు వేరు దేశాల తపాళా బిళ్ళలు సేకరించడం చాలా ఇష్టంగా ఉండేది. దీనివల్ల నాకు ప్రపంచంలోని దేశాల గురించి చాలా ఆసక్తికరమైన విషయాలు తెలుస్తుండేవి. (అప్పుడే స్విట్జర్లాండు ప్రజలు తమ దేశాన్ని హెల్వెటియా అని ఎందుకంటారనే ప్రశ్న నాలో తలెత్తింది. దీని జవాబుకోసం మేం ఎన్నో పుస్తకాలు చూడాల్సి వచ్చింది. తద్వారా ఆ దేశ చరిత్ర గురించి మాకు బాగా తెలిసింది.) దేశ విదేశాల కథలు, ప్రముఖుల యాత్రలు చదవడంవల్ల నాకు ఆ దేశాలన్నిటి గురించి చాలా విషయాలు తెలిశాయి. భూగోళశాస్త్రం కూడా ఇలాగే నేర్చుకున్నాను. నేను తొమ్మిదవ తరగతిలో శరత్‌చంద్ర "రిపథేర్ దావి", జవేర్‌చంద్ర మెఘానీ రాసిన "ప్రభు పథారే" వంటి ఉపన్యాసాలు చదివాను. వీటిమూలంగా నాకు బర్మాదేశం గురించి బాగా తెలిసింది. ఈ ఉపన్యాసాలిచ్చిన ప్రేరణతో నేను బర్మా వెళ్ళాను.

మా ఉపాధ్యాయులు రాజనీతి శాస్త్రం, సామాన్య శాస్త్రం కూడా వేరే రీతిలో నేర్పించారు. రోజూ సాయంత్రం దినపత్రికలలోని ముఖ్యమైన, ఆసక్తికరమైన విషయాలు మాకు చదివి వినిపించేవారు. ఈ విషయాల వెనుకదాగిన చరిత్ర, రాజనీతి గురించి మాతో చర్చించేవారు. క్యూబాకి రష్యా అందించిన అణు పరిజ్ఞానం, దాన్ని ఆపడానికి అమెరికా చేసిన ప్రయత్నాలు అప్పట్లో ముఖ్య విశేషాలు. రెండో ప్రపంచ యుద్ధం ఫలితంగా ప్రపంచ దేశాలన్నీ పెట్టుబడిదారీ వ్యవస్థ, సామ్యవాదం అనే వర్గాలుగా విడిపోయాయి. మా టీచర్లు రష్యా, అమెరికా మధ్య ఉన్న శత్రుత్వం గురించి, క్యూబాలో జరిగిన విప్లవం గురించి వివరించేవారు. ఈ చర్చల ద్వారా మేం ఎన్నో విషయాలు నేర్చుకున్నాం. ✪

# నూతన విధానం

గాంధీజీ విద్యా విధానం, టాగోర్ కళాప్రేమని కలబోసి ఒక రూపం ఇవ్వటానికి ఎన్నో సృజనాత్మక ప్రయోగాలు జరిగాయి. ఇందుకు చాలా ఉదాహరణలు చెప్పవచ్చు. రాత పరీక్షలే కాకుండా వంటచేయడం, నాటకాలు రాయడం – వేయడం, సభలో మాట్లాడడం, ఉత్తరాలు రాయడం



వంటి విషయాల్లో కూడా మాకు పరీక్షలు ఉండేవి. ఇంకో విశేషం ఏమిటంటే మా బడిలో తరగతులనేవి నిర్దిష్టంగా కాకుండా పిల్లల సామర్థ్యాన్ని బట్టి ఉండేవి. అంటే పిల్లలు అన్ని విషయాలలో ఒకే తరగతిలో ఉండాల్సిన అవసరం లేదు. పిల్లల్లో ప్రతి ఒక్కరు కొన్ని విషయాలని బాగా అర్థం చేసుకొని, ఇంకొన్ని విషయాల్లో వెనుకబడి ఉంటారు. వారి ప్రతిభని బట్టి ఒక్కొక్క విషయంలో ఒక్కొక్క తరగతిలో ఉండవచ్చు. నేను ఒకే సంవత్సరంలో ఏడవ తరగతి ఇంగ్లీషు, తొమ్మిదవ తరగతి లెక్కలు, పదవ తరగతి మరాఠీ నేర్చుకున్నాను.

మంచి విలువలని పిల్లల్లో పెంచడం ఈ విధానం యొక్క ప్రత్యేకత. శ్రమని గౌరవించడం, సొంతకాళ్ళపై నిలబడడం, సమత, ఐక్యత మా రోజువారీ జీవితంలో బడి ఒక భాగం. వీటన్నింటితోపాటు దేశంలో సామాజిక పరివర్తన కోసం జరిగే ఆందోళనలో మేం పాల్గొనే వాళ్ళం. ప్రతి సంవత్సరం కొన్ని రోజులపాటు బడిని వదిలి పిల్లలందరం దూరగ్రామాలకి వెళ్ళేవాళ్ళం. అక్కడ భూదాన్ వంటి ఆందోళనలో పాల్గొనే వాళ్ళం.

నేనీ బడి గురించి మాట్లాడినప్పుడల్లా "మా పిల్లల్ని ఆ బడికి పంపాలని ఉంది. ఇప్పటికీ ఆ బడి నడుస్తుందా?" అని అడుగుతారు. దీనికి నేనేం జవాబు ఇవ్వగలను?

గాంధీజీ గ్రామోద్యోగ్ ఉద్యమాన్ని ప్రభుత్వం ప్రోత్సహించలేదు. పెద్ద పెద్ద పరిశ్రమలతో పోటీలో ఈ ఉద్యమం వెనుకబడింది. "నయీ తాలీమ్" విద్యావిధానం కూడా అప్పటి విద్యారంగంలో నిలదొక్కుకోలేక పోయింది. ప్రభుత్వ గుర్తింపు లేకపోవడం వల్ల ఈ బడి పిల్లల భవిష్యత్తు ఒక ప్రశ్నగా తయారయ్యింది. ఈ కారణాలవల్ల తల్లిదండ్రులు వారి పిల్లలను ఈ బడికి పంపడం మానేశారు. "భూదాన్", "గ్రామ్‌దాన్" ఆందోళనల్లో పాల్గొన్న చాలామంది వారి పిల్లలని ఒకప్పుడు ఈ బడిలో చేర్పించారు. కానీ తరువాత వారిని ఈ బడికి పంపడం మానేశారు. సమాజం గానీ, ప్రభుత్వం గానీ ఈ బడి విలువ తెలుసుకోలేకపోయాయి. ప్రతికూల పరిస్థితులలో ఒంటరిగా నిలిచే ఇటువంటి పద్ధతులేవీ ఎక్కువకాలం నిలబడలేవు. తరువాత కాలంలో "గ్రామ్‌దాన్" ఆందోళన కూడా కొనసాగలేకపోయింది. సమాజంలోని స్వార్థ చింతన, పోటీతత్వం ఈ అద్భుతమైన బడిని బలి గొన్నాయి. నా మనస్సులో ఇప్పటికీ ఒక కోరిక ఉంది. నా కొడుకును ఆ అద్భుత బడిలో చదివించాలని. కానీ ఇప్పుడు అదెక్కడుంది?

✪